చతుర - జూలై, 1983

"వివాహాలు స్వర్గంలో నిర్ణయమవుతాయి-"

# మేడిన్ హెవెన్

వెంకట్రావు అన్ని విధాలా తెలివైన వాడే! ఎమ్మెస్సీదాకా ఫస్టుక్లాసులోనే పాసయ్యాడు. ఆ తర్వాత పీహెచ్‌డీకి కూడా పరీక్షలంటూ ఉంటే బాగుండేదే కానీ దానికి పరీక్షలు లేవు. ఏదైనా విషయమై పరిశోధనలు చేసి - పరిశోధనలకొక రూపం వచ్చేక ఆ వివరాలన్నీ థీసిస్ అనబడే పుస్తకరూపంలో రాసి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఆఫీసులో సబ్మిట్ చేయాలి మరి.

రీసెర్చిలో చేరగానే వెంకట్రావుకు మంచి ప్రోబ్లమే దొరికింది. దాంతో అతడి వర్క్ చక్కగా కొనసాగింది. రెండేళ్ళల్లోనే ప్రయోగాలు చేయడం అయిపోయింది.

ప్రొఫెసరుగారు "ఇంక నువ్వు థీసిస్ రాయడం మొదలుపెట్టవచ్చు" అన్న మర్నాడే అనుకోకుండా వెంకట్రావుకి ఉద్యోగం వచ్చింది.

"ఉద్యోగంలో చేరిపో. నెమ్మది మీద థీసిస్ సబ్మిట్ చేయవచ్చు" అన్నారు ప్రొఫెసరుగారు ప్రేమతో.

వెంకట్రావు ఉద్యోగంలో చేరాడు. అది ఓ రీసెర్చి లాబరేటరీలో సైంటిస్టు పని. అసలాఫీసు టైములోనే అతడు థీసిస్ రాసుకున్నా అడిగేవారెవ్వరూ లేరు. కానీ వెంకట్రావు థీసిస్ రాయలేదు. పీకెలమీద పరీక్ష, తేదీ - అంటూ ఏమైనా ఉంటే తప్ప అతడికి కాగితం, కలం తీసే అలవాటు లేదు. అతడికి తెలివితేటల పాళ్ళకంటే బద్ధకం పాలు ఎక్కువ. తెలివైనవాళ్ళే బద్ధకస్తులవుతారని చిన్నప్పుడో హరిదాసుగారు చెప్పగా విని ఉన్నాడతను.

వెంకట్రావుకు శ్రేయోభిలాషులు చాలామంది ఉన్నారు. వాళ్ళంతా అతడిని థీసిస్ రాయమని సతాయించారు.

"వేదవ్యాసుడంతటివాడు గణపతి దొరికితేగాని భారతం చెప్పలేదు. నాకూ ఓ గణపతి కావాల్సి వచ్చేట్లుంది" అన్నాడతను.

తను చెబుతూంటే రాసేవాడు రాసుకుపోవాలి. తనకాపనిలో సాయపడాలనుకునే వారు ఇరవై నాలుగుగంటలూ తనని అంటిపెట్టుకొని ఉండాలి.

ఈ షరతుకు అతడి స్నేహితులెవరూ ఒప్పుకోలేదు. కానీ మరో విధంగా అతడికో అవకాశం వచ్చింది. చంద్రం అనే అతను గది దొరక్క ఇబ్బంది పడుతూంటే తన గదిలో ఉండవచ్చునని వెంకట్రావే అన్నాడు.

చంద్రంచేత వెంకట్రావు థీసిస్ రాయించుకుంటాడని అంతా అనుకున్నారు. కానీ అలా జరుగలేదు.

వెంకట్రావు శ్రేయోభిలాషులు "ఇంకలాభం లేదోయ్! నీకింక థీసిస్ నీ భార్యే రాసి పెట్టాలి" అన్నారు.

ఉద్యోగంలో చేరిన మూడేళ్ళ దాకా వెంకట్రావు పెళ్ళిగురించి ఆలోచించలేదు. ఈలోగా ప్రొఫెసరుగారు థీసిస్ విషయమై అతడికి చాలా ఉత్తరాలు రాశారు. వర్కు పూర్తిచేసి ఇంతకాలం థీసిస్ రాయకుండా ఉండిపోయి ఆయన శిష్యవర్గంలో రికార్డు సృష్టించి ఉన్నాడు వెంకట్రావు.

థీసిస్ కోసమనే ఏమో వెంకట్రావు పెళ్ళిచేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాడు. ముందే ఓ మంచి ఇల్లు చూసుకున్నాడు. తనెలాగూ థీసిస్ భార్య చేతనే రాయించుకోవాలనుకుంటున్నాడు కాబట్టి పెళ్ళిచూపులకు వెళ్ళేటప్పుడు అమ్మాయి కనీసం గ్రాడ్యుయేటైనా అయుండాలని చూసుకునేవాడు. దస్తూరీ ఎలా ఉండేదీ తెల్సుకునేవాడు.

వెంకట్రావుకి పెళ్ళయింది. పెళ్ళినాటికి పెళ్ళికూతురు బియ్యే పాసై మూడేళ్ళయింది.

వెంకట్రావు శ్రేయోభిలాషులందరూ ఎంతో సంతోషించారు. ఇంకనైనా అతడు థీసిస్ రాసి పీహెచ్‌డీ సంపాదించుకుని లాబొరేటరీలో మిగతా చాలామందికి వలెనే తనూ డాక్టర్ అనిపించుకుంటాడని ఆశించారు.

వివాహమైన కొత్తలో దంపతులిద్దరూ కొన్నాళ్ళపాటు చిలకాగోరింకల్లా తిరిగారు. ఆ తర్వాత సాయంత్రాలు భార్యమాత్రమే పెత్తనాలకు వెళ్ళేది. అతడింట్లో ఉండిపోయేవాడు. ఏమిటని ఎవరైనా అడిగితే "ఆయన రాసుకోవాలి కదా మరి!" అనేది.

ఈ వార్త విని శ్రేయోభిలాషులు ఎంతగానో సంతోషించి అతడిని అభినందించాలని ఓరోజు సాయంత్రం అతడింటికి వెళ్ళారు. ఇంట్లో అతడొక్కడే ఏదో రాసుకుంటూ కూర్చుని ఉన్నాడు.

"నీ భార్య తను రాయకపోయినా నీచేత థీసిస్ రాయిస్తోంది. ఈ మార్పుకు మాకు చాలా సంతోషంగా ఉంది. థీసిస్ ఎంతవరకూ వచ్చింది?" అనడిగారు శ్రేయోభిలాషులు.

"ఇది థీసిస్‌కాదు. మా ఆవిడ ఎమ్మే పరీక్ష కడుతోంది. నోట్స్ ప్రిపేర్ చేస్తున్నాను." అన్నాడు వెంకట్రావు గంభీరంగా.

"ఆవిడ ఎమ్మే పరీక్షకు కట్టడమేమిటి? అంతగా ఎమ్మే చదవాలని ఉంటే బియ్యే

చదివాక మూడేళ్ళు ఖాళీగా ఉంది కదా అప్పుడు చదవలేకపోయిందా?" అనడిగారు శ్రేయోభిలాషులు ఆశ్చర్యంగా.

"తనకు మొదట్నించీ ఎమ్మే చదవాలని ఉందట. కానీ బియ్యేకిలాగ ఎమ్మేకి గైడ్సు లేవుగదా. ఇంట్లో ఎవర్నడిగినా పెళ్ళైతే నీమొగుడు రాసి పెడతాడులే కాస్త చదువుకున్నవాణ్ణి చేసుకో అన్నారుట. అందుకని ఎమ్మేకి ఇప్పుడు కడుతోంది" అన్నాడు వెంకట్రావు.

"అవును - వివాహాలు స్వర్గంలో నిర్ణయమవుతాయన్న విషయం పెద్దలు ఎప్పుడో చెప్పారుగదా" అని నిట్టూర్చేరు మిత్రులు.

✦ ✦ ✦